పర్యాటక కేంద్రంగా నోచుకోని 'మొగదాలపాడు బీచ్'

పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

విశాలాంధ్ర-గార/నరసన్నపేట : జిల్లాలో విస్తారంగా వున్న సముద్ర తీరం అభివృద్ధికి దూరంగా వుంది. నేడు ప్రపంచమంతా బీచ్ టూరిజానికి నిధులు వెచ్చించి, తద్వారా అధిక లాభాలను ఆర్జిస్తున్న నేటి తరుణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీచ్ టూరిజానికి మొండి చేయి చూపిస్తుంది. జిల్లా కేంద్రానికి సుమారు 15కిలోమీటర్ల దూరంలో గార మండలం, మొగదాలపాడు బీచ్‌పై సవతి తల్లి ప్రేమ కనబరుస్తోంది. ప్రతీ ఏటా మాఘ మాసంలో చిన్న వత్సవలస గ్రామంలో నిర్వహించే శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి పండుగల్లో భాగంగా మొగదాలపాడు బీచ్ భక్తుల స్నానాలతో కిటకిటలాడుతోంది. సుమారు 4లక్షల మంది భక్తులు నాలుగు వారాలు తల్లి దర్శనానికి వచ్చి, ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకుంటారు. దీనికితోడు ప్రతీ సంవత్సరం వైశాఖ మాసం, శ్రావణ మాసం, కార్తీక మాసాల్లో శ్రీకాకుళంలో అరసవెల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దర్శనం చేసుకున్న భక్తులు, ప్రక్కనే వున్న శ్రీకూర్మం శ్రీ కూర్మనాధుని దర్శనం చేసుకుంటారు. అనంతరం మొగదాలపాడు బీచ్‌కు వెళ్ళి తిరుగు ప్రయాణమవుతారు. అంతేకాక మాఘ మాసంలో సాలిహుండంలో జరిగే భీష్మ ఏకాదశి నాడు కొండపై వెలసి వున్న శ్రీ సంతాన వేణుగోపాలస్వామిని దర్శించుకున్న లక్షలాది భక్తులు, వారి గమ్యస్థానాలు చేరే ముందు సాలిహుండం కొండను, మొగదాలపాడు బీచ్‌లో సేద తీరి వెళతారు. ఇలా వివిధ ప్రత్యేకతలకు వేదిక అయిన మొగదాలపాడు బీచ్‌ను జిల్లా మంత్రులు పట్టించుకోకపోవటం విడ్డూరంగా వుందని పర్యాటకులు విమర్శిస్తున్నారు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం 2035వ సంవత్సరానికి పూర్తి చేయాలనే దృక్పథంతో నిర్మాణం చేసే సాగరమాల ప్రోజెక్ట్ ఈ సముద్ర తీరానికి ఆనుకొని వుండటం మరో విశేషం. ఇలా ఒకవైపు పుణ్య క్షేత్రాలు, మరోవైపు సాగరమాల జాతీయ రహదారి నిర్మాణం, పోర్టుకు అవసరమైన విశాలవంతమైన స్థలం కల్గివున్న మొగదాలపాడు బీచ్‌లో లక్షలాది మంది భక్తులకు ఉపయోగపడే సత్రాలు, రిసార్ట్‌లు నిర్మాణం చేసి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ మొగదాలపాడు బీచ్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

దేశాన్ని అప్పుల్లో ముంచిన బీజేపీ మోడీ ప్రభుత్వం

5వ రోజు నగరంలో వామపక్షాల ప్రచార భేరి

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : బిజెపిని సాగనంపుదాం - దేశాన్ని కాపాడుకుందాం అని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సిపీఎం నగర కన్వీనర్ టి.తిరుపతిరావులు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలో తుమ్మా వీధి, బర్మా కోలనీ, కత్తెరవీధులలో ఇంటింటి కరపత్ర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ హయాంలో దళితులకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం తీరుతో దళిత, గిరిజన, మహిళలు సంక్షేమానికి, సామాజిక న్యాయానికి దూరమైపోతున్నారని విమర్శించారు. మత విద్వేషాలు, కులవివక్ష, పెత్తందారీ పద్ధతులతో మనువాద శక్తులు పెట్రేగిపోతున్నారన్నారు. కార్పొరేట్లకు రాయితీలు, పేదలకు కష్టాలు, కన్నీళ్లు తప్ప సంతోషం లేదని అన్నారు. విశాఖ ఉక్కును అమ్మేయడం తో మోడీ అభిమానం ఉత్తరాంధ్ర పై ఏపాటిదో అర్ధమయ్యిందని తెలిపారు. ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి డోల శంకరరావు, సహాయ కార్యదర్శి కొమర భాస్కరరావు, సీపీఐ సీనియర్ నాయకులు చిక్కాల గోవిందరావు, మహిళా సమాఖ్య నాయకురాలు పట్టా ప్రభావతి, సీపీఐ నాయకులు పి.అప్పారావు, దుర్గారావు, పట్టా ప్రసాద్, సీపీఎం నాయకులు వెంకట్రావు పాణిగ్రహి, శ్రీదేవి పాణిగ్రహి, ఎం.లలిత, ఏ. మహాలక్ష్మి, ఎస్.శ్రీనివాసులు, కె.శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో : తొమ్మిదేళ్ళ పాలనలో కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం దేశాన్ని అప్పుల్లో ముంచిందని సీపీఐ పార్టీ నాయకులు అనపాన షణ్ముఖరావు, యడ్ల గోపి, పాల పోలారావులు అన్నారు. సీపీఐ, సిపిఎం రాష్ట్ర కమిటీలు పిలుపు మేరకు నిర్వహిస్తున్న ప్రచార భేరి కార్యక్రమం మంగళవారం నాడు కోటబొమ్మాళి మండలం తులసిపేట దళితవాడలో వారు పాల్గొని మాట్లాడారు. 1947 నుండి 2014 వరకూ అరవై ఎనిమిదేళ్లలో నెహ్రూ, నందా, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ, చరణ్ సింగ్, రాజీవ్‌గాంధీ, వి.పి.సింగ్, పి.వి.నరసింహారావు, వాజ్ పాయ్, దేవగౌడ, మన్మోహన్ సింగ్ వంటి పదేహేను మంది ప్రధాన మంత్రులు యాభై ఎనిమిది లక్షల కోట్లు అప్పు చేసి అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. మోడీ 2014 నుండి 2023 వరకూ తొమ్మిదేళ్ళపాలనలో సుమారు తొంభై లక్షల కోట్లు అప్పు చేశారని అన్నారు. భారతదేశ ప్రజలు రక్త మాంసాలు దారబోసి సృష్టించిన దేశ సంపదను ఆధానీ,అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా అమ్మి దేశ ప్రజలకు ద్రోహం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ఆస్తులు ప్రైవేటుపరం చేస్తూ రిజర్వేషన్లు అమలుకాకుండా మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. దేశ ప్రజల మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలపై అవగాహన చేసుకొని చైతన్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని, లేకుంటే దేశ భవిష్యత్ ప్రమాదంలోకి వెళ్తుందన్నారు. ఏపీ విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు అమలుకాక రాష్ట్రం తీవ్ర సమస్యలు ఎదుర్కొంటుందన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వడంలో బీజేపీ మోడీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి ఉత్తరాంధ్రకు నీటి వాటా పంపకాలు చేయడంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విధానాన్ని రద్దు చేయాలని, విశాఖ రైల్వేజోన్ హామీ అమలుచేయాలని, రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుక బడిన జిల్లాలకు అభివృద్ధికి నిధులు కేటాయింపు చేయాలని, మూలపేట పోర్టును ప్రభుత్వమే నిర్వహించాలని, భావనపాడు ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తి చేసి మత్స్యకారులను వలసలు నివారించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడవలసిన వైఎస్ఆర్సీపీ, టిడిపి, జనసేన పార్టీలు బిజెపితో అంటకాగుతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో డి.హెచ్.పి.ఎస్. మండల నాయకులు చిట్టి సింహాచలం, చిట్టి అప్పన్న, గురయ్య, చిట్టి మల్లమ్మ, పార్వతి, కొల్లు చిన్నప్పడు, బార సింహాచలం, కోత ఆసిరయ్య, చిట్టిరేవతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత : సర్పంచ్

విశాలాంధ్ర-కవిటి : పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యనికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు సర్పంచ్ దూగాన భద్రాచలం పేర్కొన్నారు.ఈ మేరకు మంగళవారం దూగానపుట్టుగ గ్రామంలోని సచివాలయం ఆవరణంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిజనల్ వ్యాధులు ప్రభలకుండా విస్తృతంగా పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. వేసవి రిత్యా గ్రామాలలో త్రాగునీటికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది,గ్రామస్తులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడే ముఖ్యమంత్రిచే మూలపేట పోర్టు శంకుస్థాపన

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టును రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేడే శంకుస్థాపన చేయనున్నారు. మొదటి దశలో3000కోట్ల రూపాయలు తో4 బెర్తులు నిర్మాణం చేయనున్నారు. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్సీ, వివిధ శాఖలకు చెందిన ఉన్నత అధికారులు శంకుస్థాపన కార్యక్రమాలను ఈనెల 19 కి శంకుస్థాపన కార్యక్రమానికి సిద్ధం చేశారు. ఇందులో భాగంగా మూలపేట సముద్రపు రేవులో ముందుగా సముద్రపు పూజను, భూమి పూజను చేయనున్నారు. అనంతరం మూలపేట సముద్రపు ఒడ్డున శంకుస్థాపనకు పైలాన్ ఏర్పాటు చేయడంతో శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నౌపడ లో బహిరంగ సభకు ఏర్పాట్లు చేయగా బహిరంగ సభలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. శంకుస్థాపన సభాస్థలిని ఏర్పాటు చేశారు. శంకుస్థాపన కార్యక్రమాలను గత కొద్ది రోజుల నుంచి మంత్రులు సీదిరి అప్పలరాజు,సమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ రావు, బొత్స సత్యనారాయణ, ఐటీ మంత్రి అమర్ నాద్ రెడ్డి, ,మాజీ డిప్యూటీ సీఎం కృష్ణదాసు, తోపాటు మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి, కలెక్టర్ శ్రీ కేష్ లాటకర్, జిల్లా ఎస్పీ రాధిక, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి శంకుస్థాపన ఏర్పాట్లను సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి శంకుస్థాపనకు బహిరంగ సభకు వచ్చేందుకు మూలపేట, నౌపడ లో రెండు చోట్లా హెలీపాడ్లను సిద్ధం చేశారు.

సీఎం సభా ఏర్పాట్లను మంత్రి బొత్స పరిశీలన

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం మూలపేట గ్రీన్ ఫీల్డ్ ను, రాష్ట్ర మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. శంకుస్థాపన అనంతరం నౌపడ లో జరుగబోవు సభాస్థలి ఏర్పాట్లు ను పరిశీలించారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ రావు, మాజీ ఎంపీ కిల్లి కృపారాణి, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

నాటుసారా అరికట్టే వరకు ఉద్యమిస్తాం

జనసేన నాయకులు లొల్ల రాజేష్

విశాలాంధ్ర-కవిటి : మండల కేంద్రంతో పాటు మారుమూల గ్రామాల్లో నాటు సార విక్రయాలు అరికట్టేంతవరకు జనసేన పార్టీ తరపున ఉద్యమిస్తూనే ఉంటామని జనసేన నాయకులు లొల్ల రాజేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రమైన కవిటి లో నాటు సారాపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కవిటి ఈఓ వీరభద్రస్వామి, పోలీస్ స్టేషన్‌లో హెచ్‌సి రూప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నాటుసారా తాగితే వచ్చే అనారోగ్యం గురించి వివరిస్తూ, సారా విక్రయాలను నిర్మూలించేలా తగుచర్యలు చేపట్టాలని పోలీస్ స్టేషన్‌లో, మండలస్థాయి ప్రభుత్వాధికారులకి జనసేన నాయకులు లొల్ల రాజేష్ పెద్దఎత్తున జన సైనికులతో ర్యాలీ చేపట్టి నాటుసారా విక్రయించే స్థలాలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. త్వరితగతిన నాటుసారా నిర్మూలించాలనీ లేనియెడల జనసేన పార్టీ తరపున ఉద్యమిస్తామని జనసైనికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కవిటి మండల జన సైనికులు పాల్గొన్నారు.

విద్యార్థి దశే కీలకం

- విద్యార్థులు చదువుపైనే దృష్టి పెట్టాలి
- ఎంయుపీ స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో డాక్టర్ సూర శ్రీనివాసరావు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల/అరసవల్లి : భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో స్థిరపడాలంటే విద్యార్థి దశే కీలకమని ఎస్ ఎస్ ఆర్ చారిట్రబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు అన్నారు. తోటపాలెంలోని ఎంపీయుపీ స్కూల్ మొదటి వార్షికోత్సవ వేడుకల్లో మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి నుంచే విద్యార్థులు తమ భవిష్యత్‌ను ప్రణాళికాబద్ధంగా మలుచుకోవాలని చెప్పారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి స్థానాలకు చేరుకోగలరని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే విషయాలను గుర్తు పెట్టుకొని ఆచరించాలని చెప్పారు. ఈ వయసులో తొందరగా చెడు ప్రభావాలకు లోనయ్యే అవకాశం ఉంటుందని అపరిచిత వ్యక్తుల కు దూరంగా ఉండాలని, సెల్ ఫోన్‌లకు బానిసలుగా మారరాదని అన్నారు. భవిష్యత్తు కలలకు ఇది పునాదని ఇక్కడ బాగా చదువుకుని మంచి మార్కులు సాధించిన వారు సమాజంలో అందరితో గౌవరించ బడతారన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను ఫోన్లను ఇవ్వద్దని అన్నారు. నేటి సమాజంలో విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని వివరించారు. ఏనాడు విద్యకు పేదరికం అడ్డు కాదని ఏకాగ్రతతో ఆసక్తి కనబరిస్తే ఉన్నత శిఖరాలను అవరోధిం చొచ్చని విద్యార్థులకు తెలియజేశారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్ కల్లేపల్లి తిరుపతిరావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

20న ఐటిఐలో జాబ్ మేలా

విశాలాంధ్ర-పలాస : పలాస డా.కణితీస్ ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 20వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఎలక్ట్రిషియన్, పిట్టర్, వెల్డర్, ఎలక్ట్రానిక్, మెక్ ట్రేడ్‌లల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు జాబ్ మేలా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైల జవహార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. కడపకు చెందిన షిరిడిసాయి ఎలక్ట్రికల్ లిమిడెట్ కంపెనీలో పని చేసేందుకు మెగా జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లుతో పాటు ఎస్ఎస్‌సి, ఐటిఐ, రెండు పాస్‌పోర్టు పోటోలు, ఆధార్‌కార్డు, బయోడేటా ధరఖాస్తుతో హాజరుకావాలని కోరారు. మరెన్ని వివరాలకు 9701566392, 9440344958 నెంబర్లుకు సంప్రదించాలని కోరారు.

రూ.10లక్షలతో గడ్డయ్య చెరువు ఆధునీకరణ

ప్రారంభించిన జెడ్పీటిసి ధర్మాన కృష్ణచైతన్య

విశాలాంధ్ర-నరసన్నపేట : పట్టణంలో దేశవానిపేట సమీపంలో సుమారు రూ.10లక్షలు మేజర్ పంచాయితీ నిధులతో గడ్డయ్య చెరువు ఆధునీకరణ చేశారు. ఈ సందర్భంగా పోలాకి జెడ్పీటిసి, డా.ధర్మాన కృష్ణచైతన్య మంగళవారం చెరువును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు స్వామిబాబు ఈ చెరువు స్థలాన్ని తన తండ్రి పేరు మీద నాడు త్రవ్వించి, ప్రజల దాహార్తిని తీర్చారని, నేడు మేజర్ పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు రూ.10లక్షలు నిధులు వెచ్చించి, ఈ వేసవిలో త్రాగునీరు చెరువులో ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, ఎంపిపి, ఆరంగి మురళీధర్, జెడ్పీటిసి, చింతు అన్నపూర్ణ, ఏఎంసి చైర్మన్, పొన్నాన దాలినాయుడు, వైసిపి నాయకులు, చింతు రామారావు, కెసిహెచ్‌బి.గుప్తా, పాగోటి రాజారావు, వైశ్యరాజు కేశవరాజు, నేతింటి రాజేశ్వరరావు, దండి జయప్రకాష్, రమణసాహు, రఘుపాత్రుని శ్రీధర్, ఇట్రాజు రామారావు, ముద్దాడ అప్పలనాయుడు, నాగవంశం శ్రీనివాసరావు, పతివాడ గిరిశీర్వరావు, నేతింటి సింహాచలం, బగ్గు రమణయ్య, పెదిరెడ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి

పలాస మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

విశాలాంధ్ర-కాశీబుగ్గ : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో జరిగే అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మంగళవారం 12వ వార్డు తాటివీధిలో 2.70 లక్షల మున్సిపాల్ సాధారణ నిధులతో నిర్మించే 75 మీటర్ల సి.సి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14వ ఆర్థిక ప్రణాళిక సంఘం నిధులతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టామని, మున్సిపల్ పాలన ఏర్పడి రెండేళ్ల కాలంలో పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పోతనపల్లి ఉమాకుమారి, హరి, వైఎస్ చైర్మన్లు బొర క్రిష్ణారావు, మీసాల సురేష్, పలాస ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ భవానీ, వైసీపీ పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం, కోఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్, సత్యంలు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్ద పీట

స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు

విశాలాంధ్ర-కవిటి : పేదల సంక్షేమానికి వైయస్సార్సీపి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు అన్నారు.ఈ మేరకు మంగళవారం మండలంలోని లండారి పుట్టుగ పంచాయతీలోని పొందూరుపుట్టుగ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ముఖ్యఅతిథిగా పాల్గొని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి జగనన్న పాలనలో మీకు మీ కుటుంబానికి మంచి జరిగిందా.. సంక్షేమ పథకాలు మీ ఖాతాల్లో నేరుగా వేయాలా లేక వాలంటరీ ద్వారా చేతికి అందించడం బాగుందా సంక్షేమ పథకాలు భవిష్యత్తులో కొనసాగించాలా వద్దా అంటూ లబ్ధిదారులకు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్తు చామంతి, లీగల్ సెల్ కన్వీనర్ పులకల శ్రీరాములు, గ్రామస్తులు,సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బైరిపురంలో... మండలంలోని బైరిపురం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఏఎంసి వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హార్బర్ శంకుస్థాపన ఏర్పాట్ల పరిశీలన

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలంలోని బుడగట్లపాలెం తీరంలో నిర్మించనున్న ఫిషింగ్ హార్బర్‌ను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో బుధవారం ప్రారంభించనున్నారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరిశీలించారు. 365 కోట్ల రూపాయల అంచనాతో సాగరమిత్ర ప్రాజెక్ట్ నిర్మించనుంది. సీఎం మూలపేట వద్ద ఫోర్ట్ శంకుస్థాపనకు విచ్చేస్తున్న సందర్భంగా అక్కడ నుంచే బుడగట్లపాలెం హార్బర్ను వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. ఈకార్యక్రమాన్ని బుడగట్లపాలెం ప్రాంతవాసులు స్వయంగా వీక్షించేందుకు ఎల్ఈడి స్క్రీన్ ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ఐడిసిఎల్ ఎస్ఇటి జయప్రసాద్, మత్స్యశాఖ డిడి టీవీ శ్రీనివాసరావు, తహశీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలుచేయాలి

ఏపీ జేఏసి ఆధ్వర్యంలో ధర్నా

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డు, కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగు ఉద్యోగులలో ఉన్న అసంతృప్తిని, ఆవేదనను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంకోసం కృషి చేయాలని, లేదంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఏపిజెఏసి అమరావతి జిల్లా చైర్మన్ కె.శ్రీరాములు తెలిపారు. ఏపి జెఏసి రాష్ట్ర కమిటీ ఇచ్చిన మలిదశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లా కేంద్రాలలో జరుగుతున్న ధర్నా కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం రెవెన్యూ భవనం వద్ద ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై ఏపిజెఏసి అమరావతి శ్రీకాకుళం జిల్లా చైర్మన్ కె శ్రీరాములు. ప్రధానకార్యదర్శి ఎస్ వీ రమణ, ఇతర ఉద్యోగ, ఉపాధ్యాయ, సిపిఎస్, సంఘాల, ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు సంబందించి ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపైన, రాష్ట్రంలో ఉన్న నాలుగు లక్షలు పెన్షనర్లుకు ఉన్న ఇబ్బందులు, సమస్యల పైన ఫిబ్రవరి 13 న ఏపి జెఏసి అమరావతి రాష్ట్ర కమిటి ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి ఇచ్చిన 50 పేజీల మెమోరాండంలో ఉన్న సమస్యలను పరిష్కారించాలని, సిపిఎస్‌ను రద్దుచేసి, ఓల్డ్ పెన్షన్‌ను ఇవ్వాలని, ఉద్యోగులకు సంబందించిన ప్రభుత్వం వాడుకున్న డబ్బులు జీ.పి.ఎఫ్. మరియు ఏపి జి.ఎల్.ఐ. సంబంధించి, మరియు ఆర్టీసి ఉద్యోగులకు ఓ.టిలు, మెడికిల్ రీఎంబర్స్మెంట్ మెంటు,ఇ.హెచ్.యస్ ఆసుపత్రులకు చెల్లించాల్సిన బాకాయిలు పూర్తిగా ప్రభుత్వం చెల్లింపులు చేయాలని కోరారు. అసలు వాస్తవానికి ప్రభుత్వం ఉద్యోగులకు సంబందించిన డబ్బులు ఎన్నివేలకోట్లు వాడుకున్నారు, ఇంకా ఎన్నివేల కోట్లు చెల్లింపులు చేసారు. ఇంకా ఎంత బకాయిలు ఉన్నారు ఎర్నిడ్ లీవులకు ఎంత చెల్లించాల్సిఉంది, పెండింగు ఉన్న నాలుగు డిఏ అరియర్సుకు ఎంత చెల్లించాలి, పిఆర్సీ అరియర్సుకు ఎంత చెల్లించాలి, పెండింగ్ లోవున్న మూడు కొత్త డిఏలు, పెన్షనర్లకు చెల్లించాల్సిన డి.ఏలు ఎప్పటిలోగా ఇస్తారో వీటన్నింటిపై అంశాలవారి వ్రాతపూర్వకంగా ఏది ఎప్పుడు చెల్లిస్తారో కూడా టైమ్ షెడ్యూల్ అడిగితే దానిపై ఇంతవరకు స్పష్టత ఇంతవరకు ఇవ్వలేదు అని వారు అన్నారు. అంతేకాకుండా మార్చి 24న ఈ.హెచ్.ఎస్. కార్డులు ఉద్యోగులకు, పెన్షనర్లకు ఉపయోగం లేకుండా పోతున్నాయి, దీనిపై చర్యలు తీసుకొని మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వం ఉద్యోగుల వైద్యం డబ్బులు నెలానెలా రికవరీ తీసుకొని కూడా సరైన వైద్యం అందడంలేదన్నారు. ఎ.ఐ.టి.యు.సి. జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏపిజెఏసి అమరావతి జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు, శ్రీరాములు, ఎస్వీ రమణ, ఏ.పీ.ఆర్.ఎస్.ఏ. నాయకులు పప్పల వేణుగోపాల్, పొదిలాపు శ్రీనివాసరావు బీవీఎన్ రాజు, జీఎల్ఈ శ్రీనివాసరావు, భాషా ఉపాధ్యాయ సంఘం నాయకులు వసంతరావు, సి.ఓ. ఆపరేటివ్ డిపార్ట్మెంట్ నాయకులు లక్ష్మణరావు, సీ.పీ.ఎస్ జిల్లా కార్యదర్శి సూరిబాబు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ డిపార్ట్మెంట్ నాయకులు, ఏఐటీయుసీ ముఖ్య సలహాదారు చిక్కాల గోవిందరావు, భవన నిర్మాణం సంఘం సభ్యులు ఉప్పాడ సూర్యనారాయణ, ఏఐటీయుసీ నాయకులు పి.అప్పారావు, డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.రామారావు, మత్స్యకార్మిక సంఘం నాయకులు నాగుల తవుడు, సర్వశిక్ష అభియాన్ డిపార్ట్మెంట్ నాయకులు, ప్రజా సంఘాలు, ఇతర అసోసియేషన్ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

వడదెబ్బపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-మందస : మండలం బాలిగాం గ్రామంలో సర్పంచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వడదెబ్బపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వడదెబ్బ వలన కలిగే నష్టాలు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి మందస హెల్త్ ఎడ్యుకేషన్ డి.మంగమ్మ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వడదెబ్బపై ముద్రించిన కరపత్రాలను వైద్య సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన సిరిపురం తేజేశ్వరరావు

విశాలాంధ్ర-పాతపట్నం : కేంద్రం శ్రీ నీలమణి దుర్గ అమ్మ వారి ఆవరణలో విద్యావేత్త పాతపట్నం నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువ ఉన్న నేపథ్యంలో ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు నియోజక వర్గంలో చలివేంద్రాలు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ చలివేంద్రంలో స్వచ్ఛమైన త్రాగు నీరు మజ్జిగ ఏర్పాటు చేశామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సరాలి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, నీలమణి దుర్గ ఆలయ కమిటీ ఈఓ టి వాసుదేవ రావు, సింహాచలం, రామారావు, తదితర సిరిపురం మిత్ర బృంద సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పోస్టుల భర్తీ

నియామక పత్రాల అందజేసిన సభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఆమదాలవలస నియోజకవర్గంలో ని మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడి టీచర్లు, సహాయకుల పోస్టులను భర్తీ చేసే ప్రక్రియను ఐసిడిఎస్ అధికారులు చేపట్టారు. నియామకం చెందిన అర్హులైన వారికి స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం నియామక పత్రాలు అందజేశారు. పొందూరు మండలం తోలపి గ్రామం నుండి పూజారి లత ఆమదాలవలస మండలం చీమలవలస గ్రామం నుండి కంచరావు లత, ఆమదాలవలస మున్సిపాలిటీ కృష్ణాపురం గ్రామం నుండి బి ఝాన్సీ రాణి అంగన్వాడి సహాయకులుగా సరుబుజ్జిలి మండలం తురక పేట గ్రామం నుండి టీ.తులసిభాయ్ అంగన్వాడీ అధ్యాపకురాలిగా పోస్టులను భర్తీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ బాలింతలకు, చిన్నారులకు పౌష్టిక ఆహారం అందించడంతోపాటు వారి ఆరోగ్యాలకు అండదండలు అందించేలా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలు, లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలని,మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్ సిడిపిఓ బొడ్డేపల్లి బాలామణి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వార్డు సచివాల యాల కోఆర్డినేటర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పి ఎ సి ఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాస రావు, తదితర వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నూటూరులో టీడీపీ ఇదేమి ఖర్మ

విశాలాంధ్ర-కొత్తూరు : పార్టీ అధిష్ఠానం ఆదేశాలు మేరకు మండలం పొన్నూ టూర్ గ్రామంలో బుధవారం టీడీపీ నియోజకవర్గ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే కలమట వేంకటరమణ ఇదేమీ ఖర్మ మన రాష్ట్రానికి నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ సాగించి అనంతరం రచ్చబండను నిర్వహించి సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, నిఅంకుశ వైఖరిని ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కలమట వివరించారు. కరపత్రాలను పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయుకులు నూలు వీరభద్రస్వామి, నెల్లి అచ్చుతరావు, ఆనంద రావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మాజీ ఉపరాష్ట్రపతి జిల్లాకు రాక

విశాలాంధ్ర-శ్రీకాకుళం: మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు నేడు జిల్లాకు రానున్నారు. ఈమేరకు ఆయన క్యాంపు కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన జారీ చేసింది. 19వ తేదీ ఉదయం 6.30గం.లకు రాజాం నుండి బయలుదేరి ఉదయం 07.30గం.లకు శ్రీకాకుళం ఆర్అండ్‌బి వసతి గృహానికి చేరుకుంటారని, ఉదయం 09.10గం.లకు ఆర్ అండ్ బి నుండి బయలుదేరి ఉదయం 09.15గం.లకు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం వద్దకు చేరుకొని పుణ్యతిథి కార్యక్రమంలో పాల్గొంటారని, 9.30గంలకు అక్కడ నుండి బయలుదేరి 9.50గం. లకు రాగోలులోని జెమ్స్ ఆసుపత్రికి చేరుకోనున్నారు. ఉదయం 10.00గం.ల నుండి మధ్యాహ్నం 12.00 గం.ల వరకు జెమ్స్ మెడికల్ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనున్న ఆయన సాయంత్రం 4.00గం.లకు అక్కడ నుండి విశాఖపట్నంకు బయలుదేరి వెళ్లనున్నట్లు ఆ ప్రకటనలో వివరించారు.

నేటి నుంచి రామ్‌నగర్‌లో ఎన్ఎస్ఎస్ శిబిరం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్-7 ఆధ్వర్యంలో ప్రత్యేక సేవాశిబిరం ఈనెల 19నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం ఆఫీసర్ తొత్తడి భవాని తెలిపారు. ఈ శిబిరాన్ని వర్సిటీ విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు ప్రారంభిస్తారని, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సిహెచ్ ఎ.రాజేంద్రప్రసాద్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అనురాధ తదితరులు హాజరవుతారని చెప్పారు.

అమ్మవారి ఉత్సవాలకు ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ఆహ్వానం

విశాలాంధ్ర-పాతపట్నం : మే 21 నుండి మే 29 వరకు జరగనున్న గ్రామదేవత శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవ వాలను పురస్కరించుకొని గ్రామ పెద్దలు అందరూ కలిసి అమ్మవారి పండుగలకు సంబంధించి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని త్రాగు నీరు,విద్యుత్, మౌలిక సదుపాయాలు, వైద్య ,శాంతి భద్రతలు విషయం పై చర్చించారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి జిల్లాస్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడి సమీక్షలు నిర్వహిస్తామని చెప్పి అపాయింట్మెంట్స్ తీసుకున్నారు అలాగే జిల్లా కలెక్టర్ తో కూడా అపాయింట్మెంట్ తీసుకున్నారు రేపు ముఖ్యమంత్రి జిల్లా పర్యటన అనంతరం గ్రామ పెద్దలందరినీ తీసుకుని కలెక్టర్ మరియు ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించి మన గ్రామ దేవత ఉత్సవాలకు సంబంధించి అధికారుల సహాయ సహకారాలు పొందేందుకు అన్ని చర్యలు తీసుకునే విధంగా ఈ నియోజక వర్గం ఎమ్మెల్యే గా నా వంతు ప్రయత్నం చేస్తానని తెలియజేశారు, ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి పండుగలకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి కి అందజేసి సాధార%శీ%గా ఆహ్వానించారు, దానికి ఎమ్మెల్యే సంతోషాన్ని వ్యక్తం చేస్తూ మన నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాలను పార్టీల కతీతంగా అంగరంగవైభవంగా నిర్వహించి, అమ్మవారి ఖ్యాతిని ఇనుమడింపచేద్దామని అమ్మవారి ఆశీస్సులు పొంది ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మనసారా కోరుకుంటున్నానని అన్నారు అందరికి ధన్యవాదములు తెలియజేసి తనవంతు సహాయ సహకారాలు అమ్మవారి పండుగలకి చేయూతని ఇస్తానని చెప్పి మాటిచ్చారు.

అంగన్వాడీలు ప్రతిష్టాత్మకంగా సేవలందించాలి

జెడ్పీటిసి డా.ధర్మాన కృష్ణచైతన్య

విశాలాంధ్ర-నరసన్నపేట: అంగన్వాడీ సిబ్బంది ప్రతిష్టాత్మకంగా చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు సేవలందించాలని పోలాకి జెడ్పీటిసి, డా.ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. మంగళవారం స్థానిక పంచాయితీ కార్యాలయంలో హడ్కో కాలనీకి చెందిన అంగన్వాడీ సహాయకురాలు, నడితోక చంద్రప్రియకు డా.చైతన్య నియామక పత్రమందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందంచే పౌష్టికాహారాన్ని నిబంధనల మేరకు చిన్నారులకు అందచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు, ఎంపిపి, ఆరంగి మురళీధర్, జెడ్పీటిసి ప్రతినిధి, చింతు రామారావు, వైసిపి ప్రతినిధి, దండి జయప్రకాష్, ఐసిడియస్ పివో, కె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పేరుతో 'మార్పు' చలివేంద్రం

విశాలాంధ్ర-నరసన్నపేట : పట్టణంలో స్థానిక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో మాజీ ఎంపిటిసి, మార్పు విజయ్ కుమార్ తన తల్లితండ్రుల పేరు మీద చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం తన తల్లి తండ్రులైన మార్పు ఈశ్వరరావు, మార్పు ఈశ్వరమ్మ జ్ఞాపకార్ధం చలివేంద్రన్ని ఏర్పాటు చేసి, అనంతరం మజ్జిగ పంపిణీ చేశామన్నారు. ఈ సంవత్సరం కూడ చలివేంద్రన్ని ఏర్పాటు చేసి, ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చిన ప్రజలకు చలి వేంద్రం నుండి, త్రాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి తమ వంతు సహాయమందించిన మిత్రులకు తన కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డా.బలగ మురళీ, డాక్యుమెంట్ రైటర్, డబ్బీరు దుర్గా వెంకట ప్రసాద్, మార్పు అప్పలనాయుడు, బి.ఠాగూర్, పొట్నూరు సుధాశ్రీనివాసరావు, గెంబలి సుధాకరరావు, పొట్నూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-పలాస : పరిశ్రమల్లో జరిగే అగ్ని ప్రమాదాలపట్ల కార్మికులు అప్రమత్తం గా ఉండాలని ఎస్.ఐ సోమేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగం గా 5వ రోజు మంగళవారం పరిశ్రామికవాడ అనంతపురంలోగల ఎస్ఎస్ఎస్ ఇంటర్ నేషన్ ఎక్స్‌పో ప్రైవేట్ లిమిటెడ్ జీడి పరిశ్రమలో కార్మికులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, విద్యుత్, ఆయిల్‌ల్లో అగ్నిప్రమాదాలు జరిగితే ఏ విధంగా అరికట్టాలో డెమో ద్వారా తెలియజేశారు. ఎత్తైన భవనాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే ఫైర్ ఎక్సిటింగ్ విషర్సులో ఏ విధంగా ఉపయోగించి అగ్ని వ్యాపించకుండా ఆర్పివేయాలో డెమో ద్వారా తెలియజేశారు. అనంతరం కరపత్రా లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాస్కరరావు, యుగంధర్, ప్రేమ్‌కుమార్, మన్మధరావు, సంతోష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడు మద్యం మత్తులో మాట్లాడుతున్నారు..!

మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : మద్యం మత్తులో చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని రాష్ట్ర మత్స్య శాఖ మరియు ప్రస్తుత శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. భావనపాడు మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పనులు పరిశీలనకు వచ్చిన ఆయన మాట్లాడుతూ, రాత్రంతా అయ్యన్నపాత్రుడు మద్యం తాగుతూ, పగలు హ్యాంగోవర్ అవుతూ మాట్లాడుతున్నారని అటువంటి మాటలు మానుకోవాలని ఆయన అన్నారు. చంద్రబాబు నాయుడు గురించి అందరికీ తెలుసని, ఎన్టీ రామారావు కుటుంబాన్ని వాడుకొని, ఎన్టీఆర్ కి వెన్నుపోటు పొడిచారని ఆయన అన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి విశేష స్పందన

విశాలాంధ్ర-పాతపట్నం: శివశంకర్ కాలనీలో ప్రతి ఇంట "మా నమ్మకం నువ్వే జగన్" "జగనన్నే మా భవిష్యత్" కార్యక్రమా పాతపట్నం వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాతపట్నం శివశంకర్ కాలనీలో రెండు వీధుల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారుదులు, వాలంటీర్లతో ప్రతీ ఇంటికి వెళ్లి ఇంటి యజమానుల అనుమతి తో స్టిక్కర్లు అంటించారు. అదేవిధంగా గత ప్రభుత్వ కాలములో సంక్షేమ పథకాలు ప్రస్తుత ప్రభుత్వ కాలంలో జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమం గురించి ప్రజల అభిప్రాయసేకరణ చేశారు. అలాగే వృద్ధులకు అందుతున్న వృద్ధాప్య పింఛన్లు అర్హులైని ప్రతివారికి అందుతున్నాయని కానీ గత ప్రభుత్వం పాలనలో జన్మభూమి కమిటీలు అనుమతిస్తే అవి కొందరికే అందేవని ఇప్పుడు అ పరిస్థితి అలా లేదని అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ అందుతున్నందుకు మీరు ఎవరికైనా లంచం ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం మండల వైసిపి అధినేత సవిరిగాన ప్రదీప్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గోకవలస రాము, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు గౌరుసెట్టి వెంకటరమణ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు టంకాల సుధాకర్, మజ్జి వరదరాజు, పెద్దింటి తిరుపతిరావు, సవిరిగాన కృష్ణారావు ప్రదీప్ యువసేన సభ్యులు, శివశంకర్ కాలనీ యువకులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి యువజన సంఘం ఆర్థిక సాయం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి గ్రామానికి చెందిన సేవా యువజన సంఘం సభ్యులు, పోలాకి మండలం కోడూరు గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి తుంగాన జగదీష్‌కు రెండు కిడ్నీలు పాడయ్యాయన్న సమాచారం తెలుసుకొని పదివేల 16 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. కిడ్నీ బాధతో వ్యాధితో బాధపడుతున్న విద్యార్థి వైద్యం కోసం అధిక మొత్తంలో ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పడంతో, ఏమీ తోచని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు ఉండిపోయారు. దీంతో స్పందించిన సేవా యువజన సంఘం సభ్యులు కూచెట్టి భాను ప్రకాష్, అట్టాడ సాయికుమార్, చింతాడ సోమేశ్వరరావు, చింత శంకర్రావు, శ్రావ్య, జగదీష్‌లు సహాయం చేసారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

విశాలాంధ్ర-ఆమదాలవలస : దేశంలోనూ, రాష్ట్రంలో న్యాయవాదులపై పోలీసులు, సిఐడి తప్పుడు కేసులు పెడుతూ ఇబ్బందులు గురి చేస్తుండడంతో నిరసన వ్యక్తం చేస్తూ న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలో భాగంగా న్యాయవాదులపై ఒక వక్క పోలీసులు మరోపక్క సిఐడి పోలీసులు కేసులు, తప్పుడు ఆరోపణలు చేస్తూ నోటీ సులు జారీ చేయడానికి తీవ్రంగా పరిగణిస్తూ ఆముదాలవలస జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి భాయ్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా సిఐడి పోలీసులకు వ్యతిరేకంగా న్యాయవాదులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సాధు ధనుంజయ్ రావు, బొడ్డేపల్లి మోహన్ రావు, జి ప్రభాకర్ రావు, డి రమణమూర్తి, బూరెల్లి సీతారాం ఎస్ ప్రసాద్ రావు, రాజేశ్వరరావు, విజయ కుమార్, తమ్మినేని అన్నం నాయుడు, అచ్చం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు కేసు నమోదు చేయకపోతే ఆందోళన చేస్తాం

విశాలాంధ్ర-నరసన్నపేట : భవన నిర్మాణ కార్మికుడు, వంజరాపు రమణయ్యను విచక్షణా రహితంగా మారణాయుధాలతో తల పగుల కొట్టిన నిందితుడిని పోలీసులు సరైన సెక్షన్లు వేసి కేసు నమోదు చేయకపోతే ఆందోళన చేపడతా మని సిఐటియు జిల్లా సీనియర్ నాయకులు, ప్రముఖ అడ్వకేట్, భవిరి కృష్ణమూర్తి హెచ్చ రించారు. మంగళవారం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమణయ్యను పరామర్శించి, కుటుంబ సభ్యులతో దాడి జరిగిన విషయాన్ని కృష్ణమూర్తి తెలుసుకున్నారు. అనంత రం ఆయన మాట్లాడుతూ రమణయ్యను ముద్దాడ కన్నయ్య మరుగుతున్న నూనెను కాలుపై పోసి, లోహ మారణాయుధంతో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావం జరిగిందన్నారు. శ్రీకాకుళం ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం నరసన్నపేట ఆసుపత్రిలో చేర్పించామని తెలిపారు. రాజకీయ ఒత్తిళ్ళకు లొంగకుండా పోలీసులు కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘ గౌరవాధ్యక్షులు, ఆర్.సురేష్‌బాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, కె.సూరయ్య, కమిటీ సభ్యులు, కొర్రాయి కృష్ణ పాల్గొన్నారు.

యువత జాబ్ మేలా సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-కవిటి: మండల కేంద్రమైన కవిటి ఎస్‌విజే డిగ్రీ, జూనియర్ కాలేజీ ఆవరణలో నేడు జాబ్ మేళా నిర్వహించబడునని యువత జాబ్ మేలా సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌విజె విద్యాసంస్థల కరస్పాండెంట్ బివివి ప్రసాదరావు కోరారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు టిపిఎల్ కంపోసైట్స్ కంపెనీ వారు స్థానిక ఎస్ వి జే ఆవరణంలో మెగా జాబ్‌మేలా నిర్వహించ బడునని తెలిపారు.పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటిఐ ఉత్తీర్ణత అయిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత, యువకులు వినియోగించు కోవాలని కోరారు.

ఆటోస్టాండ్‌ను క్రమబద్ధీకరించాలి

విశాలాంధ్ర-కాశీబుగ్గ : కాశీబుగ్గ సంత మైదానం భగవతీ థియేటర్ రోడ్డు పూర్తిగా ఆటో లు, ఇతర వాహనాలతో నిండిపోయి పద్మవ్యూ హాన్ని తలపిస్తోందని, ఆటో స్టాండ్‌ను క్రమబద్ధీ కరించాలని ప్రజలు కోరుతున్నారు. బంకేశ్వరి గుడి ప్రక్క నుంచి కాశీబుగ్గ బస్టాండ్‌కు భగవతీ థియేటర్ రోడ్డు వెంబడి చేరుకోవాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని, ఇదే రోడ్డులో పలు ఏజన్సీలు, ఐరన్ దుకాణాలు ఉండటంతో వాటికి సంబందించిన లగేజీ వ్యాన్‌లు తరచూ గంటల తరబడి లోడింగ్, అన్ లోడింగ్‌లు చేస్తుండటంతో విపరీతంగా ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని ప్రజలు అన్నారు. గతంలో వన్‌వేగా అమలు పరిచిన రహదారిని అధికారులు నిర్లక్ష్యం వహించడంతో వాహన చోదకులు వన్‌వే పాటించకుండా రాను, పోను వాహనాలు నడిపి ప్రజలు నడవడానికి కూడా అవకాశం లేకుండా చేస్తున్నారని వాపోయారు. రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్‌కు రావాలంటే ఎంతో ప్రయాస పడాల్సి వస్తోందని, ఆటో స్టాండ్‌ను క్రమబద్ధీకరించి, వన్‌వేను అమలు చేయాలని స్థానికులు కోరారు.

జీవో నెం. 52ను వెనక్కి తీసుకోవాలి

విశాలాంధ్ర-మందస : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బోయ, వాల్మీకి, నకిలి బెంతుఒరియాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ తీసుకొచ్చిన 52వ జీవోను వెంటనే రద్దు చేయాలని సాబకోట గిరిజనులు కోరారు. మంగళవారం మండలం సాబకోట పంచాయతీ గిరిజనులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం గిరిజనులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీలో చేర్చేందుకు జీవో నెం.52ను అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని, దీనివలన గిరిజనులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. దీనిని వెంటనే రద్దు చేయాలని లేకుంటే వైసీపీ పదవులకు రాజీనామా చేస్తామని హెచ్చ రించారు. కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డ్వామా పీడీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం : గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ పి సూర్య కుమారిని అమరావతి సచివాలయంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జివి చిట్టి రాజు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలవుతున్న తీరు, సగటు వేతనం, తదితర అంశాలపై కమిషనర్‌కు పిడి వివరించారు.

గొట్టబ్యారేజ్ ఎత్తిపోతల పథకం శంకుస్థాపన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలన

విశాలాంధ్ర-హిరమండలం : మండల కేంద్రమైన హిరమండలం వంశధార రిజర్వాయర్ వద్ద 176.35 కోట్ల రూపాయలతో నిర్మించనున్న హిరమండలం-ఎత్తిపోతల పథకంలి శంకుస్థాపన మహోత్సవ ఏర్పాట్లను పాతపట్నం నియోజకవర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి, వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు, వంశధార అధికారులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం పరిశీలన చేశారు. బుధవారం సీఎం వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి గొట్టా బ్యారేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శంఖ స్థాపన చేయు నున్న నేపథ్యంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పర్యవేక్షణ చేశారు. వంశధార నదిలోని నీటిని లిఫ్ట్ ద్వారా జలాశయంలోకి పంపి జలాశయంలోని 19 టీఎంసిల నీటిని త్రాగు, సాగు నేరుగా జిల్లాను సస్యశ్యామలం చేయు నున్నారు ఈ ఎత్తిపోతల పథకం ద్వారా ఎమ్మెల్యే వెంట మండల వైస్సార్సీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, మండలజగనన్న సచివాలయకన్వీనర్ అందవరం వెంకట్ సురేష్, సర్పంచ్ దేవుదాల సుందరమ్మ పోలయ్య, ఉప సర్పంచ్ వి బాల్‌రాజ్, వంగ పళ్ళ చిన్న రావు, సచివాలయకన్వీనర్లు బూర శ్రీనివాస్, గొర్లె సురేష్, లూకాలపు ప్రసాద్, శైలడ పాపారావు, అల్లు కృష్ణారావు, ఎంపీడీఓ బి.శైలజ, పంచాయతీ ఈఓ ఎ.నర్సింగరావు, మీసాల రామారావు, టి.తవుడు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి... ప్రమాదాలను అరికట్టండి

- ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలి
- అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ఎం.వరప్రసాద్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : అప్రమంతంగా ఉండండి ప్రమాదాలను అరికట్టండి అని అగ్నిమాపక కార్యాలయం అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ఎం వరప్రసాద్ అన్నారు. రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాల భాగంగా ఐదవ రోజైన మంగళవారం ఎనభై అడుగుల రోడ్డులో గల పెట్రోల్ బంకు వద్ద జిల్లా అగ్ని మాపక అధికారి వీరభద్రరావు ఆదేశాలాననుసరించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని మాపక సిబ్బంది ఆపద కాలంలో అత్యవసర పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించి నప్పుడు ఏ విధంగా ప్రతిస్పందించాలి, నివారణ చర్యలు తీసుకునేందుకు తగిన సలహాలు సూచనలు డెమో అందించారు. అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ఎం.వరప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు విద్యుత్ పరికరాలు వినియోగించి నప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న చిన్న ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు అందజేశారు. అలాగే పాఠశాల యాజమాన్యం నిబంధనలకు లోబడి కావలసిన అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేయూడమేకాకుండా ఎప్పటికప్పుడు వాటికి మెంటేనేన్స్ చేయాలని అన్నారు. హాస్పిటల్స్ స్కూల్స్, అగ్నిమాపక నియమ నిబంధనలు పాటించి, ఈ వారోత్సవాలలో మీ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకొని ప్రమాదాల నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అగ్నిమాపక శాఖ అందిస్తున్న సేవలను యంత్ర పరికరాలను సిబ్బంది ఏవిధంగా వినియోగిస్తారో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యయులు, పాఠశాల సిబ్బంది అలాగే అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గిన మామిడి దిగుబడి - దిగాలు పడుతున్న రైతులు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : ఉద్దాన ప్రాంత ప్రజల జీవనాధారమైన జీడి మామిడి పంట తరువాత కొబ్బరి, మునగ, పనస పంటల తరువాత రైతులకు ఆదుకునే పంట మామిడి పంట. ఈ ఏడాది అకాల వర్షాలు వలన ఈ పంట దిగుబడి బాగా తగ్గడంతో రైతులు దిగాలు పడుతున్నారు. జీడి మామిడి తోటలలో అంతర పంటగా కొంత మంది రైతులు మామిడి పంటను పండిస్తుండగా మరి కొంత మంది ఏకంగా మామిడి పంటనే సాగు చేస్తున్నారు. పలాస నియోజకవర్గంలోని వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలాల్లోని ఉద్దాన ప్రాంతంలో జీడి మామిడి తోటలలో ఈ పంట అంతర పంటగా సాగు చేస్తూ రైతులు లబ్ది పొందుతున్నారు. వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరు, వంకులూరు, అనకాపల్లి, ఎం.గడూరు, అక్కుపల్లి, బైపల్లి, బాతుపురం, పల్లిసారధి, వజ్రపుకొత్తూరు, కొత్తపేట, దేవునల్తాడ, పలాస మండలంలోని బొడ్డపాడు, రంగోయి, నీలావతి, కొబ్బరి చెట్లూరు, మామిడిపల్లి, మాకన్నపల్లి, మందస మండలంలోని సువర్ణపురం, బేతాళపురం, సాబకోట, కొండలోగాం, బోగాబంద, కొంకడాపుట్టి తదితర పంచాయితీలలో ఈ పంటను రైతులు పండిస్తున్నారు. జీడి మామిడి పంటతో వచ్చిన ఆదాయంతో పాటు మామిడి పంట అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతో ఆయా గ్రామాల ప్రజల జీవనం సాగిస్తున్నారు. బంగినపల్లి, చిలకమూతి, కలక్టరు, నీలాం, చెరుకురసం, సువర్ణరేఖ తదితర పేర్లుతో మామిడి రకాలు రైతులు పండిస్తున్నారు. ఈ ప్రాంతంలో పండించే మామిడి పళ్ళు మంచి ంచి క ం ం గా ఉండటంతో ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి. కలెక్టరు, చిలకమూతి, కోలంగోవా వంటి రకాలు ఎక్కువగా పచ్చళ్ళకు ఉపయోగిస్తారు. అయితే పళ్ళు పండించే రకాలకు సంబందించి నవి, పచ్చళ్ళకు విని యోగించే రకాలు సైతం పశ్చిమ్‌బంగా, కొల్‌కొత్తా, టాటా తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. పచ్చికాయలు కేజీ 20 నుండి 30 రూపాయిల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. కాయలు ముదరక ముందే రైతులు వాటిని తీసి అమ్మకాలు చేస్తున్నారు.

నైతిక విలువలతోనే మెరుగైన సమాజం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : నైతిక విలువలు పెంపొందించడంతోనే మెరుగైన సమాజం నిర్మాణం సాధ్యమని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ బెంగుళూరు మాజీ విసి వివేకానంద స్కూల్ ఆఫ్ లా అండ్ లీగల్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ వెంకటరావు తెలిపారు. డా. బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ మహాత్మా జ్యోతిరావు పూలే న్యాయ కళాశాలలో మంగళవారం నైతిక విలువల ప్రాముఖ్యం అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యాసంపార్జనతోపాటు విలువలను పెంపొందించు కోవాలన్నారు. విద్య కేవలం విజ్ఞానానికే కాకుండా సమాజంలో విలువలు పెంపొందించాలన్నారు. నైతిక విలువలతోనే సమాజంలోని వివిధ వ్యక్తులు వర్గాల మధ్య అంతరాలు తగ్గుతాయని చెప్పారు. ప్రేమకు చిరునామా అయిన మదర్ థెరిసా శాంతికి పెద్దపీట వేసిన నెల్సన్ మండేలా వంటి ప్రముఖులతో తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. న్యాయవృత్తిలో నైతికతకు ప్రాధాన్యత ఇస్తే సమాజానికి మరింత ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అంబేద్కర్ వర్సిటీ విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ సాటి మానవులపట్ల విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యార్థి దశ నుంచే నైతికతను అలవర్చుకోవా లన్నారు. ఈకార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రర్ ప్రొఫెసర్ సిహెచ్ రాజేంద్రప్రసాద్, వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డీన్ డాక్టర్ ఎస్ ఉదయ్ భాస్కర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ బివి రమణమూర్తి, కోర్సు కోఆర్డినేటర్‌వై రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా పాలన : స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-పొందూరు : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గ్రామ సచివాలయాలను స్థాపించి దానికి అనుబంధంగా వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటుచేసి అవినీతికి, వివక్షకు తావు లేకుండా పాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి నేడు దేశమంతా కీర్తిస్తుందని శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. పొందూరు మండలం మొదలవలస సచివాలయం పరిధిలోని బొడ్డేపల్లి, చిన్న బొడ్డేపల్లి గ్రామాలలో సుమారు 250 గడపలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకుంటూ అధికారులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, మండల టౌన్ పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్,గాదు నాగరాజు, మార్కెట్ కమిటీ అధ్యక్షులు బడాన సునీల్, పిఏసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, పొందూరు మేజర్ పంచాయితీ సర్పంచ్ రేగిడి లక్ష్మి, మండల సచివాలయంల కోఆర్డినేటర్ బాడాన కృష్ణస్థానిక సర్పంచ్ బొడ్డేపల్లి శ్రీవల్లి, స్థానిక నాయకులు బొడ్డేపల్లి రమణ, బొడ్డేపల్లి చంద్రశేఖర్, బొడ్డేపల్లి కృష్ణ, బమ్మిడి జగదీష్, తదితరులు వైయస్సార్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఎంత ఆదాయం వస్తుందో తెలియజేయండి

విశాలాంధ్ర - జలుమూరు : దక్షిణ కాశీగా పేరుందిన శ్రీముఖలింగేశ్వర స్వామివారి దూపదీప నైవేద్యాలకు అర్చకులకు ఇచ్చే దేవుని ధాన్యం విషయంలో వాస్తవానికి 150 బస్తాలు ధాన్యం మాత్రమే ఇవ్వడం ఆనవాయితీగా ఉండేది, అలాంటిది నగదు రూపంలో ఇచ్చేస్తున్నారని ఆలయ అర్చకులు నాయుడు రాజశేఖర్ ఆవేదన చెందాడు. ఇచ్చేది కూడా మార్కెట్ రేటు కాకుండా 1100 చొప్పున ఇవ్వడం ఎంతవరకు సమంజసమని, జిల్లాలో మిగతా అర్చకులకు ఒక మాదిరిగా మాకు ఒక పద్ధతిలో ఇవ్వడమేమిటని ఆయన ప్రశ్నించారు. అసలు స్వామివారి పేరు మీద రాధా గోవిందస్వామి నరసింహస్వామి పేరుమీద వందల ఎకరాల నుండి ప్రతి సంవత్సరం ఎంత మేరకు ఆదాయం వస్తుందో పత్రికా ముఖంగా తెలియజేయడం లేదని, తక్షణమే దేవాదాయ శాఖ ఉన్నత అధికారులు విచారణ జరిపి వాస్తవాలు బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

మండల జనసేన అధ్యక్షుడిగా తాడేల చిరంజీవి

విశాలాంధ్ర- నందిగాం : మండల జనసేన మండల పార్టీ అధ్యక్షుడిగా తాడేల చిరంజీవిని, పార్టీ అధ్యక్షుడు కే.పవన్ కళ్యాణ్ ఆయనకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చిరంజీవి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. యువకుడు ఉన్నత విద్యావంతుడైన తాడేల చిరంజీవి పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేశారని, జనసేన పార్టీ తరపున 2020లో నందిగాం మండలంలో ఎంపీటీసీగా సైలాడ పంచాయతీ శివరాంపురం పంచాయతీలో పోటీ చేసినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పజెప్పిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు, పార్టీ ముఖ్య నాయకులకు రుణపడి ఉంటానని చిరంజీవి అన్నారు. చిరంజీవి నియాకం నియామకం పట్ల జనసేన నాయకులు టెక్కలి జనసేన ఇన్చార్జి కణితి కిరణ్, పల్ల బాలకృష్ణ, షణ్ముఖరావు, పసుపురెడ్డి సోమేష్, కురాకుల యాదవ్‌లు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే హాజరు

విశాలాంధ్ర-పాతపట్నం : మండలం, ప్రహరాజపాలెంలో గల మసీద్ కామ్రాన్‌లో మాతాధిపతి సయ్యద్ షాజహాన్ అధ్యక్షతన పాతపట్నంకు చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పారశెల్లి రామరాజు మాస్టారు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి మట్లాడుతూ ముస్లిం సోదరులందరికీ రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో పారశెల్లి రామరాజు, షేక్ చాంద్, షేక్ ఇబ్రహీం, షేక్ సలీం, సయ్యద్ జమాల్, షేక్ ఫకీర్, మొహిద్దిన్, పనుకు మోహన్, సవిరిగాన ప్రదీప్, ఏనుగుతల సూర్యం, ప.వెంకటరమణ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

అగ్నిస్త్రం తయారు చేస్తున్న రైతులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: మండలం పల్లివలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులు అగ్నిస్త్రం అనే కషాయాలు తయారు చేసుకున్నారు. ఈ కషాయం తయారీలో వేపాకులు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, పొగాకు ను తీసుకొని వీటిని వేరువేరుగా మెత్తగా దంచుకొని ఈ మిశ్రమాన్ని 15 లీటర్లు ఆవు మూత్రంలో ఐదు పొంగులు వచ్చేంతవరకు మరగబెట్టాలని, ఈ విధంగా తయారుచేసిన కషాయాన్ని 200 లీటర్ల నీరుకుగాను ఆరు లీటర్ల కషాయాన్ని కలిపి పంటలపై పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కషాయం పిచికారి చేయడం వలన ముఖ్యంగా పంటలను ఆశించిన గొంగళి పురుగులు మరియు కాయ కాండం తొలిచే పురుగులు నివారణ అవుతాయన్నారు. ఈ విధంగా రైతులందరూ కూడా పంటలపై ఎటువంటి ఎరువులు పురుగుమందులు వినియోగించకుండా కేవలం ప్రకృతి సేద్యంలో పంటలను పెట్టుబడి లేకుండా సులువుగా పండించవచ్చునని, మెరుగైన దిగుబడులని పొందవచ్చునని సిబ్బంది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పి.తులసి, రోహిణి, రాజు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జిల్లా మలేరియా అధికారి (డిఎంఓ) పివి సత్యనారాయణ

విశాలాంధ్ర-కవిటి : విష జ్వరాలు నియంత్రణకు ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి (డి ఎం ఓ) పి వి సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు మంగళవారం కపాసుకుద్ది గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాజపురం పి. హెచ్.సి సిబ్బంది కపాసుకుద్ది గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని తాగాలని అన్నారు.గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి మురికి నీటి నిల్వలు ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లాలని, గ్రామంలో రోజు విడిచి రోజు ఫాగింగ్(పొగ)పనులు చేపట్టాలని కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో రాజపురం వీ హెచ్చీ వైద్యాధికారి శశిధర్, ఎల్ శ్రీకాంత్, ఈవో అభిమన్యు సోయి, ఎస్ ఎన్ పాణిగ్రాహి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ శంకుస్థాపనకు, ఏర్పాట్లు చేస్తున్న పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు. సముద్రం పూజలు, పైలాన్, జగన్మోహన్ రెడ్డి సైతక శిల్పం, నూతన రహదారులు నిర్మాణం, తదితర కార్యక్రమాలు ఏర్పాట్లు దృశ్యాలు.